సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 6 । మార్చి । 2025

10న ఐటీఐలో అప్రెంటిస్ మేళా

కడప కాగితాలపెంటలోని గవర్నమెంట్ డీఎల్‌టీసీ ఐటీఐలో ఈనెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు ఏడీ రత్నరాజు తెలిపారు. అర్హత గల ఐటీఐ అభ్యర్థులు తమ పదో తరగతి, ఐటీఐ మార్కుల జాబితా, ఎన్‌టీసీ సర్టిఫికెట్‌తోపాటు ఆధార్, కులధ్రువీకరణ పత్రాలతో టీఎల్‌టీసీ ఐటిఐ కార్యాలయానికి హాజరుకావాలని తెలిపారు.

-కడప ఎడ్యుకేషన్

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు॥ (సా॥)	సహర్ శుక్ర॥ (ఉ॥)
రాయచోటి :	6.28	5.09
రాజంపేట :	6.26	5.17
పీలేరు :	6.28	5.06
మదనపల్లె :	6.30	5.11

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.124
రెండోరకం	రూ.70	రూ.99

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 80 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

రాయచోటి : జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 49 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలలో 13152 మందికి గానూ 12598 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షల నిర్వహణలో లోటుపాట్లు లేకుండా విద్యార్థులకు తగిన మౌలిక వసతులు కల్పించామని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎం.కృష్ణయ్య తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 11639 మంది హాజరు కాగా 504 మంది గైర్హాజరయ్యారని, అలాగే ఒకేషనల్ పరీక్షలకు 969 మంది హాజరు కాగా 50 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వారు తెలిపారు.

మార్చి 30 నాటికి పక్కా గృహాలు పూర్తి చేయాలి

– జిల్లా హౌసింగ్ పీడీ శివయ్య



మాట్లాడుతున్న జిల్లా హౌసింగ్ పీడీ శివయ్య

రామాపురం : మార్చి 30 నాటికి జిల్లాలో పక్కా గృహాలను పూర్తి చేయించాలని జిల్లా హౌసింగ్ పీడీ శివయ్య ఆదేశించారు. రామాపురం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 79,721 పక్కాగృహాలు మంజూరు కాగా, 2024 జూన్ నాటికి 33,179 పక్కాగృహాలు పూర్తి అయినట్లు తెలిపారు. రామాపురం మండలం హౌసింగ్ ఏఈగా పనిచేస్తున్న కేఎస్ఎం ప్రసాద్‌కు బదిలీ ఉత్తర్వులు ఇచ్చినా ఆఫీసుకు రావడం లేదని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులు శ్రద్ధ చూపి గృహాలు త్వరగా నిర్మించుకోవాలన్నారు. సొంత స్థలంలో ఇల్లు కట్టుకునే వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జాషువా పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

– డీఈవో సుబ్రహ్మణ్యం



గుర్రంకొండలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో సుబ్రహ్మణ్యం

గుర్రంకొండ : డొక్కా సీతమ్మ పథకం కింద విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని డీఈవో సుబ్రహ్మణ్యం అన్నారు. గుర్రంకొండ, ఖండ్రిగ గ్రామాల్లో పాఠశాలల్లో బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్థానిక ఉర్దూ జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు వడ్డించడానికి సిద్ధంగా ఉంచిన భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనం తినే విద్యార్థుల హాజరు రిజిష్టర్ తనిఖీ చేసి ప్రతి విద్యార్థి భోజనం చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. అనంతరం ఖండ్రిగ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేసిన ఆయన ఎఫ్ఎ పరీక్షలు రాస్తున్న విద్యార్థులను కలిసి సిలబస్ గురించి ఆరా తీశారు. కొందరు ఉపాధ్యాయుల పనితీరుపై విద్యార్థులు ఫిర్యాదు చేయడంతో ప్రతి ఉపాధ్యాయుడిపై హెడ్మాస్టర్లు నిఘా పెట్టాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి ఎఫ్ఎమ్ శిక్షణపై అడిగి తెలుసుకొన్నారు. సకాలంలో అంగన్‌వాడీ కేంద్రాలకు చేరుకొని మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సురేంద్రబాబు, హెడ్మాస్టర్ కమ్మర్‌తాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి బ్రహోత్సవాలకు అంకురార్పణ వైభవంగా జరిగింది. స్వామి బ్రహోత్సవాలు బుధవారం నుంచి లాంఛనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామునే మూలవర్లకు అభిషేకం, తోమాల సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా కలశస్థాపన చేసి వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ స్వస్తివాచనం, పుణ్యాహవాచనం గావించారు. అనంతరం రక్షాబంధనం, మృత్యంగ్రహణం, అంకురార్పణ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.



దాహం కేకలు

ఎండలు మండుతున్నాయి.. రాబోయే రెండు నెలల్లో 44 డిగ్రీలకు పెరిగే అవకాశం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. భూగర్భ జలాలు అడుగంటిన పక్షంలో జలాశయాల నీటితోనే దాహార్తి తీర్చుకునే పరిస్థితి. కానీ ఆ దిశగా కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. రూ.100 కోట్లతో చేపట్టిన పనులను నిలిపివేసింది. దీంతో అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ఈ వేసవిలో ప్రజల దాహం కేకలు వినిపించనున్నాయి. పురపాలక సంఘం అందిస్తున్న నీరు సరిపోక ఇప్పటికే పట్టణ వాసులు ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. దీనికి తోడు పైపులైన్ల లీకేజీ వ్యవహారంతో మధ్యలోనే నీరు నేలపాలవుతోంది.

- జిల్లా కేంద్రానికి తప్పని తాగునీటి ఎద్దడి
- పైపుల లీకేజీలతో ప్రతి నిత్యం నీరు వృథా
- నాడు దివంగత వైఎస్సార్ చొరవతో తీరిన దాహార్తి
- నేడు రూ.100 కోట్లతో చేపట్టిన పనుల నిలిపివేత
- పెరిగిన జనాభాకు 15 మిలియన్ లీటర్లు అవసరం

రాయచోటి : రాయచోటి పట్టణ పరిధి విస్తరించడంతో జనాభా 1.10 లక్షలకు చేరింది. 206 వీధులు ఉండగా.. సుమారు 32,355 వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీరికి ప్రస్తుతం 114 నీటి బోర్లు, 53 చేతిపంపుల ద్వారా అరకొరగా నీరు అందుతోంది. ఇవి చాలకపోవడంతో ప్రస్తుతం పట్టణానికి ప్రధాన ఆయువు వెలిగల్లు జలాశయం ద్వారా 40 కిలోమీటర్ల దూరంలోని రాయచోటి ప్రజలకు రోజూ పైపులైన్ల ద్వారా పట్టణ పురపాలక సంఘం నీటిని సరఫరా చేస్తోంది. సాధారణంగా రోజుకు 15 మిలియన్ లీటర్ల నీరు అవసరం ఉండగా, కేవలం 9 మిలియన్ లీటర్ల నీరు వెలిగల్లు నుంచి అందుతోంది. మిలియన్ లీటర్ల నీటిని బోర్లు, చేతి పంపుల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఇంకా ఐదు మిలియన్ల లీటర్ల నీటి అవసరం ఉంది.

గత పరిస్థితి తలెత్తితే..

రాయచోటి పట్టణం దినదినాభివృద్ధి చెంది అన్నమయ్య జిల్లా కేంద్రంగా రూపాంతరం చెందింది. అందుకు అనుగుణంగా పట్టణంలో ప్రతి ఒక్కరికీ కనీసం 40 లీటర్ల నీటిని అందించే దిశగా పురపాలక అధికారులు ప్రణాళికలు రూపొందించడం లేదనే విమర్శలున్నాయి. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా నెలకొన్న వర్షాభావం రాయచోటి పట్టణ వాసులకు అందించే నీటి సరఫరాపై పడిందే మాట వినిపిస్తోంది. రెండు దశాబ్దాల కిందట వరకూ గుక్కెడు నీటికోసం రాయచోటి వాసులు తపించిన విషయం నేటికీ కళ్లెదుట కనిపిస్తోంది. నాడు ఖాళీ బిందెలు సైకిళ్లు, ఎద్దులబండ్లు, అనుకూలమైన వాహనాలతో పట్టణ పరిసర ప్రాంతాలకు వెళ్లి పైసలు చెల్లించి చెమటోడ్చి నీటిని తెచ్చుకునే పరిస్థితి ఉండేది. ఒక్కమాటలో చెప్పాలంటే పట్టణ వాసులు నీటికోసం పోరాడిన రోజులే ఎక్కువ.

నీటికోసం అవస్థలు తప్పవా?

వెలిగల్లు జలాశయం నుంచి నీటిని అందించడంలో పురపాలక శాఖ అధికారుల నిర్లక్ష్యంతో పట్టణ వాసులకు ఈ ఏడాది దాహం కేకలు తప్పడం లేదు. పట్టణ పరిధిలో అక్కడక్కడ కొద్దో గొప్పో బోర్ల నుంచి పైపులైన్ల ద్వారా వివిధ ప్రాంతాలకు దిస్తున్న వందల లీటర్ల నీటి లీకేజీలు, నిర్వహణ లోపాలతో వృథా వుతోంది. ప్రధాన పైపులైన్ల నుంచి పట్టణంలోని 12457 ఇళ్లకు వారానికి ఒక రోజు వంతున నీటి కనెక్షన్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఇంకా 6 నుంచి 8 వేల కుటుంబాలకు నీటి సరఫరా సక్రమంగా లేదు. వారందరికీ నీరందించేందుకు వెలిగల్లు నుంచి రాయచోటికి, అనంతరం పట్టణంలో 125 కిలోమీటర్ల మేర పైపులైన్ ఏర్పాటు చేశారు. పైపులైన్లు, వాల్వ్‌ల నుంచి లీకేజీలు ఎక్కువగా ఉండడం, పైపులైన్లు తుప్పుపట్టి పగిలిపోవడం, కొత్తగా ఏర్పాటు చేసినవి బిగించకపోవడం తదితర కారణాలతో లీకేజీలు అధికంగా ఉన్నాయి. దీంతో పగలు, రాత్రి తేడా లేకుండా గంటల తరబడి ప్రధాన రహదారులు, వీధులలో నీరు వృథాగాపోతోంది. 206 వీధులు ఉండగా అందులో నూరు వీధుల్లో పైపులైన్లు దెబ్బతిని నీరు వృథాపోతోంది. దీనికి తోడు ప్రధాన పైపులైన్ నుంచి ఇళ్లకు సరఫరా చేయడానికి అంగుళం పరిమాణం కలిగిన గొట్టాలను అక్కడక్కడా మురుగు కాలువల నుంచి ఏర్పాటు చేశారు. పైపులు దెబ్బతింటే నీరు మురుగుతో కలిసి కలుషితమయ్యే ప్రమాదం ఉంది. ఈ సంఘటనలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నా.. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు ఇప్పటి వరకు చేపట్టడలేదు.



పట్టణంలోని కొత్తపేట మార్గంలో పైపుల నీటి వృథాతో మడుగుగా మారిన దృశ్యం

నాడు వైఎస్సార్ చొరవతో..



పునాది దశలో ఆగిన నీటిట్యాంక్ నిర్మాణం

ఈ పరిస్థితులు తెలుసుకున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గాలివీడు సమీపంలో వెలిగల్లు ప్రాజెక్టు పూర్తి చేయించారు. అక్కడి నుంచి 40 కిలోమీటర్ల మేర పైపులైన్ వేయించి పట్టణ ప్రజల దాహార్తి తీర్చారు. నేటికీ రాయచోటి ప్రజలు తాగుతున్న నీరు, వినియోగిస్తున్న ప్రతి బొట్టులోనూ వైఎస్సార్ కృషి కనిపిస్తుంది. అనంతరం రాయచోటి పట్టణం జిల్లా కేంద్రంగా రూపాంతరం చెందడంతో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అప్పటి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆనాటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రజల దాహార్తి తీర్చేందుకు వెలిగల్లు జలాశయం నుంచి రెండో పైపులైన్ నిర్మాణం కోసం రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయించారు. 60 శాతం మేర పనులు పూర్తి చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వం ఆ పనులు నిలిపివేసింది. రాయచోటి వాసుల దాహార్తి తీర్చే అవకాశం లేకుండాపోయింది. జనాభాకు అవసరమైన నీరందడం లేదు. దీనికి తోడు వెలిగల్లు నుంచి పట్టణానికి రెండో పైపులైన్ నిర్మాణంలో భాగంగా గాలివీడు-మదనపల్లి రింగ్‌రోడ్డు సమీపంలో ఏర్పాటుచేస్తున్న ట్యాంకు పనులు, దిగువ అబ్బవరం సమీపంలో నిర్మిస్తున్న భూ ఉపరితల ట్యాంక్ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. కొత్తపల్లి ప్రాంతానికి తాగునీరందించే పాత పురపాలక సంఘం ప్రాంతంలోని ట్యాంకు కూల్చారే తప్ప కొత్తది నిర్మించలేదు.

సమస్యను అధిగమిస్తాం



జిల్లా కేంద్రంలో తాగునీటి సమస్యను ప్రణాళికాబద్ధంగా అధిగమిస్తాం. పట్టణంలో పైపులైన్ల నుంచి నీటి లీకేజీలు అరికట్టడానికి చర్యలు చేపట్టాం. దెబ్బతిన్న పైపులైన్లు గుర్తించి వాటికి మరమ్మతులు చేస్తాం. తద్వారా నీరు వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. వెలిగల్లు నుంచి రెండో పైపు నిర్మాణ పనులు పాత కాంట్రాక్టర్ ద్వారానే కొనసాగించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశించారు.

– వాసుబాబు, మునిసిపల్ కమిషనర్, రాయచోటి

ప్రధాన పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టాలి



రాయచోటి పట్టణ ప్రజల దాహార్తి తీర్చడానికి చేపట్టిన రెండో నీటి పథకం పనులు పూర్తిచేయాలి. అప్పటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి రూ.100 కోట్ల నిధులు రెండో పైపులైన్ నిర్మాణానికి మంజూరు చేయించారు. 60 శాతానికి పైగా పూర్తి చేయించారు. మిగిలిన పనులను పూర్తి చేయించి పట్టణ ప్రజల దాహార్తి తీర్చాల్సి ఉంది. పాత పురపాలక కేంద్రంలో కొత్త ట్యాంకు నిర్మించాల్సి ఉంది. లీకేజీలకు మరమ్మతులు చేయించాల్సి ఉంది.

– ఫయాజ్‌బాషా, మున్సిపల్ ఛైర్మన్, రాయచోటి

పది పరీక్షలకు భానుడి సెగ

- పరీక్షా సమయంలో జాగ్రత్తలు అవసరం!
- పోషకాహారం... తగినంత నిద్ర అవసరం

మదనపల్లె సిటీ : జిల్లాలో మార్చి రాగానే ఎండలు మండిపోతున్నాయి. రోజు రోజుకూ ఉష్ణోగ్రత పెరుగుతుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఓ వైపు ఎండల తీవ్రత.. మరో వైపు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ఎండల తీవ్రతకు భయపడి బయటకు రావాలంటే ప్రజలు హడలిపోతున్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు జరగనున్నాయి. ఈ సమయంలో విద్యార్థులు ఎక్కువ ఒత్తిడికి లోనవుతుంటారు. సక్రమంగా ఆహారం తీసుకోకుండా పుస్తకాలతో కుస్తీ పడుతుంటారు. ఒక వైపు పరీక్షలు.. మరో వైపు ఎండ వేడిమితో అల్లాడిపోయే విద్యార్థుల ఆరోగ్యం విషయంలోనూ తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిందే మరి.

ఇలా చేయాలి..

ఎండ వేడిమి పెరుగుతుండడంతో విద్యార్థులు కొన్ని జాగ్రత్తలు పాటించకపోతే నిద్రలేమి, డీ హైడ్రేషన్‌తో బాధపడాల్సి వస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఈ జాగ్రత్తలు పాటిస్తే చాలంటున్నారు. 24 గంటల వ్యవధిలో 8–10 గ్లాసుల నీళ్లు తప్పకుండా తాగాలి. ఎండలో వెళ్తే టోపీ, గొడుగు లాంటివి వాడాలి. కళ్ల జోడు పెట్టుకోవాలి. విద్యార్థులు తేలికపాటి, లేత రంగు దుస్తులు ధరించడం శ్రేయస్కరం. కూల్ డ్రింక్స్, జ్యూస్‌లు, ఐస్ కలిపిన రకరకాల పానీయాలు తాగొద్దు. ఐస్ శుభ్రంగా లేకపోతే డయేరియా, కలరా, టైఫాయిడ్, పచ్చ కామెర్లు వస్తాయి. బయటి ఆహారపదార్థాలకు దూరంగా ఉండాలి. నూనె పదార్థాలు, వేపుళ్లు, ఉప్పు ఎక్కువ ఉండే జంక్‌ఫుడ్స్ తీసుకోకూడదు.

ద్రవ పదార్థాలు ఎక్కువగా...

కేవలం నీళ్లు కాకుండా కొబ్బరి నీళ్లు, ఉప్పు కలిపిన మజ్జిగ, నిమ్మరసం లాంటివి తీసుకుంటే శరీరానికి నీటితో పాటు ఖనిజ లవణాలు అందుతాయి. ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు ఉండేలా చూసుకోవాలి. దోసకాయ, కర్బూజ సలాడ్లు ఎక్కువగా తీసుకోవాలి. సొరకాయ, బీరకాయలాంటి నీటి శాతం ఎక్కువగా ఉన్న కూరలు తీసుకోవడం ద్వారా శరీరంలో డీ హైడ్రేట్ కాకుండా చూసుకోవచ్చు. కనీసం 7–8 గంటలు నిద్రపోవడం చాలా అవసరం. పోషకాహారం తీసుకోవడం వల్ల పరీక్షలు మరింత బాగా రాయగలుగుతారు.



స్పెషల్ క్లాసులో పదో తరగతి విద్యార్థులు

వైద్యులను సంప్రదించాలి



అధిక జ్వరం, పల్స్ పడిపోవడం, కండరాలు నొప్పులు, తీవ్రమైన నిస్సత్తువ, వాంతులు, విరేచనాలు లాంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఆరోగ్యాన్ని కాపాడుకుంటేనే పరీక్ష బాగా రాయగలుగుతారు.

– డాక్టర్ వెంకటరామయ్య, వైద్యులు, సీహెచ్‌సి,బి.కొత్తకోట

పశువైద్య కళాశాలలో ఉద్రిక్తత



కళాశాల మెయిన్ గేట్ మూసి బైఠాయించిన పశువైద్య విద్యార్థులు



విద్యార్థులతో మాట్లాడుతున్న రూరల్ ఎస్ఐ మహ్మద్ రఫీ, కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాసప్రసాద్

- కళాశాలలో హాస్టల్ మూసివేత
- బైఠాయించి నిరసన తెలిపిన విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని గోపవరం సమీపంలోని పశువైద్య కళాశాలలో బుధవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. తిరుపతి పశువైద్య విశ్వవిద్యాలయం వీసీ ఉత్తర్వుల మేరకు ఉదయం 7 గంటలకు కళాశాలలోని విద్యార్థుల హాస్టల్‌ను మూసివేశారు. ఉదయం అల్పాహారం హాస్టల్‌లో తయారు చేయకపోవడంతో పశువైద్య విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల ప్రధాన గేట్ వద్ద బైఠాయించి టీచింగ్, నాన్ టీచింగ్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఎవరిని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ మహ్మద్ రఫీ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తున్నారని, క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి వస్తుందని విద్యార్థులను ఎస్ఐ హెచ్చరించారు. దీంతో విద్యార్థులు మెయిన్ గేట్‌ను ఓపెన్ చేశారు. అనంతరం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్‌ను పశువైద్య విద్యార్థులు కలిసి వినతి పత్రం సమర్పించారు. కళాశాల హాస్టల్‌ను తెరవాలని కోరారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రొద్దుటూరు నుంచి క్యాటరింగ్ ద్వారా విద్యార్థులంతా భోజనాలు తెప్పించుకుని అక్కడే తిన్నారు. అనంతరం శిబిరంలో కూర్చొని యథావిధిగా సమ్మె చేశారు. తమ ఉద్యమాన్ని అణచివేసేందుకే పశువైద్య కళాశాలల్లో హాస్టల్‌ను మూసివేసి అధికారులు బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు.

అందరి నోట..టమాట

- ఈ వేసవిలో అత్యధిక ధర లభిస్తుందనే నమ్మకం
- పెట్టుబడి భారం లెక్క చేయకుండా టమాట సాగు
- జిల్లా వ్యాప్తంగా 4,303 ఎకరాల్లో సాగు
- ప్రస్తుతం 2,791 ఎకరాల్లో పంట దిగుబడులు





కట్టెలతో సాగుచేసిన టమాట పంట

బి.కొత్తకోట : టమాట పంటతో ఈ మారు తాడో పేడో తేల్చుకోవాలని రైతాంగం సిద్ధమైంది. రాష్ట్రంలో అత్యధికంగా సాగయ్యే తంబళ్లపల్లి నియోజకవర్గంలోనూ గత ఏడాది పంట సాగులో కష్టాలు, నష్టాలు, సమంగా చూస్తూ ఈ ఏడాది రైతాంగం సర్దుకుపోతోంది. ఎవరి నోట విన్నా టమాటా సాగు మాటే వినిపిస్తోంది. వేసవిలో టమాటా ధరలను దృష్టిలో పెట్టుకున్న రైతులు.. మళ్లీ తమ కష్టాలు తీరిపోతాయనే ఆశతో పంట సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 4,303 ఎకరాల్లో టమాట పంట సాగైంది. ఈ పంట కాలం పూర్తి కావస్తోంది. ఇందులో 60 శాతం మేర తంబళ్లపల్లి నియోజకవర్గంలోనే సాగైంది. ప్రస్తుతం 2,791 ఎకరాల్లో దిగుబడులు తీయడమేగాక, గడచిన 15 రోజుల్లో కొత్తగా 812.5 ఎకరాల్లో మళ్లీ పంట సాగుచేసినట్లు అధికారిక లెక్క. అయితే ఇప్పటికే వేయి ఎకరాలకు పైగా దాటిపోయినట్టు అంచనా. పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లి, కురబలకోట, సంబేపల్లి, పెద్దమండ్యం కలకడ, గుర్రకొండ మండలాల్లో 250 ఎకరాలకు పైగా, కలికిరి, రామసముద్రం, చిన్నమండెం, గాలివీడులో, మదనపల్లి, వీరబల్లి, రాయచోటి, కేవిపల్లి, రామాపురంలో, వాయల్పాడు, పీలేరు, టి.సుండుపల్లి, నిమ్మనపల్లి, లక్కిరెడ్డిపల్లి గ్రామాల్లో 740 ఎకరాల్లోనూ ఈ టమాటా పంట సాగు చేశారు.

ధరలపై ఆశతోనే

టమాట పంటకు గత ఏడాది పలికిన అత్యధిక ధరలను దృష్టిలో పెట్టుకుని రైతులు ఈ మారు అత్యధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. కొద్దిపాటి పొలం ఉన్న రైతు తన అదృష్టాన్ని పరీక్షించుకుందామని సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. 2024 మే నెలలో మార్కెట్‌లో కిలో టమాట రూ.48 నుంచి రూ.52 పలికింది. జూన్‌లో రూ.88 నుంచి రూ.100, జూలైలో రూ.88 నుంచి రూ.95 వరకు పెరిగింది. మార్కెట్‌లో రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేసిన ధర. బహిరంగ మార్కెట్‌లో మూడో రకం టమాట ధర కిలో సెంచరీ దాటింది. ఒక్క తంబళ్లపల్లి నియోజకవర్గం నుంచే రోజుకు 800 నుంచి వెయ్యి టన్నుల టమాట దిగుబడి వచ్చింది. ములకలచెరువు, మదనపల్లి, కర్నాటకలోని కోలారు మార్కెట్‌లలో విక్రయించారు. ఈ ధరలను దృష్టిలో పెట్టుకుని రైతులు మళ్లీ ఇవే ధరలు పలుకుతాయని భావిస్తున్నారు. తమ కష్టాలు తీరిపోతాయనే ఆశతో భారీ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమయ్యారు.

3 వేల ఎకరాల్లో సాగు

ప్రస్తుతం తంబళ్లపల్లి నియోజకవర్గంలో టమాటా సాగుపై నెలకొన్న పరిస్థితుల మేరకు ఈ నెలాఖరు, ఏప్రిల్ రెండో వారం వరకూ కనీసం మూడు వేల ఎకరాల్లో టమాట సాగయ్యే సూచనలు ఉన్నాయి. ఈ సాగంతా వ్యవసాయ బోర్ల కింద మాత్రమే. రైతులు పంట సాగుచేశాక భూగర్భ జలాలు నిలకడంగా ఉంటాయనే నమ్మకం లేదు. గత రెండేళ్లుగా సరైన వర్షాలు కురవలేదు. గత ఖరీఫ్‌లో కరవు నెలకొని పంటకు నష్టం వాటిల్లింది. తీవ్రమైన ఎండలు, భూగర్భజలాలు టమాట సాగు, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. దీంతో ధరలు పలకడం మాట అటుంచితే.. పంటను కాపాడుకుని లాభాలు పొందడం కత్తిమీద సామే అవుతుంది. ఈ పరిస్థితుల్లో టమాట పంట రైతాంగాన్ని ముంచుతుందో.. తేల్చుతుందో దిగుబడులు మొదలయ్యాక తేలిపోతుంది.

తంబళ్లపల్లిలో టమాట సాగు (ఎకరాల్లో)

మండలం	సాగులో	కొత్త పంట
ములకలచెరువు	650	160
పెద్దతిప్పసముద్రం	578	125
తంబళ్లపల్లి	458	145
బి.కొత్తకోట	458	117.5
కురబలకోట	389	135
పెద్దమండ్యం	281	130
సంబేపల్లిలో	---	286
కలకడలో	---	254
గుర్రంకొండ	---	245

ధర లభిస్తుందనే ఆశతోనే..



టమాట సాగు జూదంగా మారింది. ధరలు నిలకడగా లేకపోవడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. క్యారెట్, బీట్‌రూట్, వేరుశెనగ సాగు చేసి ఇప్పుడు టమాట పంట సాగు చేపట్టాను. ఒకటిన్నర ఎకరంలో దుక్కులు దున్ని, టమాట నారు నాటేందుకు ఇప్పటికే రూ.80 వేలు ఖర్చయ్యింది. దిగుబడి వచ్చే ముందు వరకు రూ.3 లక్షలు ఖర్చవుతుంది. ఆ సమయానికి ధరలు ఉంటాయనే ఆశతో పంట సాగు చేస్తున్నా. ధర లభించకపోతే నష్టాలు తప్పవు.

– శివారెడ్డి, టమాట రైతు, పోతుపేట

వారం తర్వాత డిమాండ్



టమాట సాగు చేసేందుకు మొక్కలకు ఈ నెల రెండో వారం నుంచి డిమాండ్ ఉంటుంది. మే నెలలో దిగుబడులు వచ్చేలా రైతులు పంట సాగు చేస్తారు. దీంతో ఏప్రిల్ 10వ తేదీ వరకు మొక్కల కోసం రైతులు నర్సరీల వద్ద క్యూ కడతారు. ఒక్కో మొక్కను 50 నుంచి 70 పైసలకు విక్రయిస్తాం. ఎకరాకు 7 నుంచి 10 వేల మొక్కలు అవసరమవుతాయి. రైతులు పంటను సాగు చేసే సమయానికి డిమాండ్‌కు తగ్గ నారును సిద్ధం చేసి ఉంచుతాం.

– పి.నాగరాజు, నర్సరీ నిర్వాహకుడు, అంగళ్లు